

సేంద్రీయ సాగుతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: సాంప్రదాయ పంటలతో అధిక దిగుబడులు సాధ్యమని శాస్త్రవేత్తలు రాజుకుమార్, ఉజ్వలరాణి, జగన్నాథం అన్నారు. కొర్రాయి పంచాయతీ కరబలి గ్రామంలో సంజీవిని, రైతు సాధికార సంస్థ, వాసన్ సంస్థ, కొండెంపూడి ఏరువాక కేంద్రం ఆధ్వర్యాన చైతన్య సమావేశంతో పాటు గులిసామ, గులిరాగి పంటకోత ప్రయోగం శనివారం జరిగింది. పాత విత్తనాలతో సంప్రదాయ బద్ధంగా సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయన్నారు. సేంద్రియ పద్ధతి సాగుతో దిగుబడులు సాధ్యపడతాయన్నారు. ఎస్ఆర్పీ దేవుళ్లు, రైతు సాధికార సంస్థ డీపీఎం భాస్కరరావు, వ్యసాయశాఖ అధికారులు నీలవేణి, సవన్‌కుమార్, రైతు భరోసా కేంద్రం సిబ్బంది, గిరిజన రైతులు ఉన్నారు.



పంటలను పరిశీలిస్తున్న అధికారులు

బంతి పూల ధరలు పతనం

-లబోదిబో మంటున్న గిరిజన రైతులు
-దసరా తర్వాత భారీగా తగ్గుదల



కాలిళ్లతో బంతిపూలను తీసుకొచ్చిన గిరిజనులు

ప్రజాశక్తి-పాడేరుటౌన్: బంతిపూల ధరలు హఠాత్తుగా పతనమవడంతో రైతులను కుంగదీసింది. మార్కెట్లో ధరలు లేక గిరిజన రైతులు అయోమయంలో పడ్డారు. రూ.150 నుంచి రూ.200 దాకా పలుకుతూ వచ్చిన బుట్ట పూలు ధర ఉన్నట్టుండి ఇప్పుడు దీని ధర రూ.50కి పడిపోయింది. దసరా పండుగ వరకు రూ.250 పలికిన బుట్ట బంతిపూలు ప్రస్తుతం రూ.50కు కూడా కొనేందుకు వ్యాపారస్తులు ఎవరూ ముందుకు రాలేదు. పూల ధరలు కనిష్ట స్థాయికి పడిపోవడంతో తాము పండించిన పూలను ఎక్కడ అమ్ముకోవాలో అర్థం కాక రైతులు తక్కువ ధరకే అమ్మి ఉసూరున ఇళ్ల బాట పడుతున్నారు. ధర గిట్టుబాటు కాకపోవడంతో గ్రామాల నుంచి పాడేరుకు పూలు తీసుకు వచ్చే గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏజెన్సీలోని పాడేరు మండలంలో లగిసపల్లి, డోకులూరు, బరిసింగి, ఇరడాపల్లి, డి.గొందూరు, గుత్తులపుట్టు, జి.ముంచంగిపుట్టు, గబ్బంగి, హుకుంపేట మండలంలో డి.చింతలవీధి, దిగుడుపుట్టు, శోభకోట, సంపంగిపుట్టు, చీడిపుట్టు, గడికించుమండ, అడ్డుమండ, సన్యాసమ్మపాలెం, దాలిగుమ్మడి, జి.మాడుగుల మండలంలో కె.కోడపల్లి, జి.మాడుగుల, సొలభం, పెదబయలు మండలంలో గంపరాయి, గలగండ పంచాయతీల్లో ఎక్కువగా బంతి తోటలు సాగు చేస్తున్నారు. రైతులు బంతిపూలను అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులోని పాత బస్ స్టాండ్ అంబేద్కర్ సెంటర్ వద్ద మార్కెట్ కు తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. పూజల్లో అధికంగా ఉపయోగించే బంతిపూలకు మంచి డిమాండ్ ఉంది. విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, నర్సీపట్నం, తుని తదితర ప్రాంతాల నుంచి పూల వ్యాపారులు వచ్చి బంతిపూలను కొనుగోలు చేస్తుంటారు. ఇక్కడ కొనుగోలు చేసిన బంతిపూలను మైదాన ప్రాంతాలకు వ్యాపారులు తరలిస్తుంటారు.



సంతకు తీసుకొచ్చిన బంతి పూలు

జిల్లాలో సాగు చేస్తున్న చిన్న బంతి పూలు (సీతమ్మ కాటుక రకం) ద్వారా ప్రతి ఏడాది గిరిజనులు మంచి ఆదాయం పొందుతారు. ఈ ఏడాది కూడా జిల్లాలో రైతులు భారీగానే బంతి తోటలు వేశారు. పూలు అధికంగా వస్తుండటంతో గిరిజనులు గత నెల రోజుల నుంచి పాడేరు పాత బస్టాండ్ మార్కెట్ కేంద్రంగా పెద్ద ఎత్తున అమ్మకాలు జరుపుతున్నారు. దసరా పండుగ వరకు పూలను రూ.200 ధరతో విక్రయించారు. వ్యాపారులే నేరుగా గ్రామాలకు వెళ్లి బుట్ట పూలను రూ.150 నుంచి రూ.200 ధరతో కొనుగోలు చేశారు. దీంతో రైతులకు మంచి ఆదాయం లభించింది.

దసరా తర్వాత భారీగా తగ్గిన ధర

దసరాకు ముందు వ్యాపారులు బుట్ట పూలను రూ.150 నుంచి రూ.200 ధరతో కొనుగోలు చేయడంతో సంతోషించాం. బుట్ట పూలను రూ.150 నుంచి రూ.200లకు కొనుగోలు చేసిన వ్యాపారులు.. ఈవారంలోని శుక్ర, శనివారాలు పాడేరు మార్కెట్ లో బుట్ట బంతిపూలు రూ.50కి మించి ధర పలకలేదు. వ్యాపారులు రూ.50కి మించి కొనుగోలు చేయడం లేదు. పైగా కొనుగోలుదారుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది.



ఆర్.సింహాచలం
గొట్టిపల్లి గ్రామం
డోకులూరు పంచాయతీ
పాడేరు మండలం

తక్కువ ధరతో నష్టం

బంతిపూల ధరలు చూసి ఆశపడ్డాం. వారం రోజుల నుంచి మార్కెట్‌లో ధరలు లేక అయోమయంలో పడ్డాం. పాడేరు పూల మార్కెట్‌లో దసరా పండుగకు ముందు రూ.200 పలికిన బుట్ట బంతిపూలు ప్రస్తుతం రూ.50కు కూడా కొనేందుకు వ్యాపారస్తులు ఎవరూ ముందుకు రాలేదు. పూల ధరలు కనిష్ట స్థాయికి పడిపోవడంతో తాము పండించిన పూలను ఎక్కడ అమ్ముకోవాలో అర్థం కా లేదు. ప్రభుత్వం తమను ఆదుకోవాలి



జి.రామన్న
దేగలవీధి గ్రామం
డోకులూరు పంచాయతీ
పాడేరు మండలం



ఐటిడిఏ పిఒకు సమస్యలను విన్నవిస్తున్న ఎంపిటిసి ప్రదీప్‌కుమార్, సర్పంచ్ లక్ష్మి

సమస్యలపై ఐటిడిఏ పిఒకు వినతి

ప్రజాశక్తి -విఆర్.పురం

మండలంలోని పెద్దమట్టపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని శనివారం ఆ పంచాయతీకి వచ్చిన చింతూరు ఐటిడిఎ పిఒ కావూరి చైతన్యకు స్థానిక ఎంపీటీసీ పూనెం ప్రదీప్ కుమార్, సర్పంచ్ వెట్టి లక్ష్మి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ పెద్దమట్టపల్లి నుంచి బూరుగువాడ వరకు ఉన్న బిటి రోడ్డును తవ్వి వదిలేశారని, దీంతో నాలుగు గ్రామాల ప్రజలు ప్రయాణం చేయాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అత్యవసర సమయాల్లో, రాత్రి వేళల్లో ఆస్పత్రులకు వెళ్లాలంటే నానా అవస్థలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఆ నిర్మాణం చేపట్టాలని కోరారు. నూతిగూడెం గ్రామ ప్రజలు ఫ్లోరైడ్ నీరు తాగడం వల్ల కిడ్నీ సమస్యల బారిన పడుతున్నారని, రక్షిత మంచినీరు కల్పించాలన్నారు. గుర్రంపేట వరకు బిటి రోడ్డు వేయాలన్నారు. ఈ సమస్య పై అధ్యయనం చేసి పరిష్కారం చేయాలని కోరారు, దీనికి పిఒ స్పందించి పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు.



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన రబ్బరు సీట్లు

అగ్నికి రబ్బరు ఆహుతి


ప్రజాశక్తి-మారేడుమిల్లి

ఆరుగాలం శ్రమించి ఉత్పత్తి చేసిన రబ్బరు అగ్నికి ఆహుతైన సంఘటన మారేడుమిల్లి మండలం పూజారిపాకల గ్రామంలో చోటుచేసుకుంది. మండలంలోని పూజారి పాకల గ్రామానికి చెందిన గిరిజన రైతు పూజారి భూమిరెడ్డి ఏడాది పాటు శ్రమించి సేకరించిన రబ్బరు పాలు ఒక గుడారంలో ఆరబెట్టారు. ఆ పాలు సీట్ల రూపంలో తయారు చేసిందుకు మంట వేసి క్రమంలో మంట అధికం కావడంతో రబ్బర్ పాల సీట్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో టన్నున్నర రబ్బరు కాలిపోవడంతో సుమారు రెండున్నర లక్షల రూపాయలు ఆస్తి నష్టం జరిగిందని బాధిత రైతు పూజారి భూమి రెడ్డి, లింగేశ్వరి దంపతులు లబోదిబోమంటున్నారు. అధికారులు స్పందించి తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

10 నుండి చెకుముకి సైన్స్ సంబరాలు

పోస్టర్లు ఆవిష్కరించిన పిఒ, ఎపిఒలు

ప్రజాశక్తి-పాడేరు: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నవంబర్ 10వ తేదీ నుండి 2024 జనవరి 28 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాల గోడపత్రికను శనివారం ఐటీడీఏ ఆవరణలో ప్రాజెక్టు అధికారి అభిషేక్, ఏపీవోలు ప్రభాకర్‌రావు, వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.త్రిమూర్తులు మాట్లాడుతూ, విద్యార్థుల్లో సైంటిఫిక్ టెంపర్‌ని పెంచేందుకు జన విజ్ఞాన వేదిక అనేక సంవత్సరాలుగా చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తుందన్నారు. సంబరాల నిర్వహణ కోసం రాష్ట్ర విద్యాశాఖ ఇప్పటికే ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. చెకుముకి సంబరాలు జయప్రదంగా నిర్వహించేలా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు సహకరించాలని ఆయన కోరారు, చెకుముకి సైన్స్ సంబరాలు సందర్భంగా నవంబరు 10వ తేదీన పాఠశాల స్థాయిలోనూ, నవంబర్ 30వ తేదీన మండల స్థాయిలోనూ, డిసెంబరు 17వ తేదీన జిల్లా, 2024 జనవరి 27, 28 తేదీలలో రాష్ట్రస్థాయిలోనూ సైన్స్ ప్రతిభాపాటవ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలలో 8, 9 ,10 తరగతులు చదువుతున్న విద్యార్థులు పాల్గొనడానికి అర్హులన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐటిడిఏ మేనేజర్ ఎటిడబ్ల్యూ ఓ తో పాటు పలువురు అధికారులు, జనవిజ్ఞాన వేదిక అల్లూరి జిల్లా జె.వి.వి ప్రధాన కార్యదర్శి శ్రీ పారయ్య, స్థానిక జె.వి.వి నాయకులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదు చేయడానికి సచివాలయానికి వచ్చిన బాధిత వినియోగదారులు

రేషన్ సరుకులు అందకపోవడంపై ఫిర్యాదు

ప్రజాశక్తి -సీలేరు

ఎమ్‌డియు ద్వారా రేషన్ సరుకులు సక్రమంగా అందజేయకపోవడంతో స్థానిక దుర్గవీధికి చెందిన వినియోగదారులు సీలేరు సచివాలయ వీఆర్వో సత్యనారాయణ, ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి, సర్పంచ్ దుర్గ, పంచాయతీ పాలకవర్గం సభ్యులకు శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ దుర్గ మాట్లాడుతూ జీకే వీధి మండలం సీలేరు జిసిసి డిపో పరిధిలో ఎనిమిది వందలకు పైగా తెల్ల కార్డులు కలిగిన వినియోగదారులు ఉన్నారని, వారికి బియ్యం అరకొరగానే ఎండియు ప్రసాద్ అందజేస్తున్నట్లు తమకు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఇంటింటికి రేషన్ సరుకులు ఇవ్వవలసి ఉండగా, అందుకు భిన్నంగా కొద్దిరోజులు జిసిసి డిపోలోనూ, మరికొన్ని రోజులు ఇంటింటికి వాహనం ద్వారా సరఫరా చేస్తున్నట్లు వినియోగదారులు ఆరోపిస్తున్నారని పేర్కొన్నారు. ఎండియు ప్రసాద్‌పై తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌కు పంచాయతీ పాలకవర్గం ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, గుమస్తా ప్రకాష్, ఉప సర్పంచ్ కే.వల్లి ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు కె. శ్రీనివాస్, వార్డు సభ్యులు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ కుసుమ, మహిళా పోలీస్ రేవతి వాలంటీర్లు దుర్గ పాల్గొన్నారు.

డొంకరాయిలో 'ఫిట్ ఇండియా ఫ్రీడమ్ రన్'

ప్రజాశక్తి-మోతుగూడెం

సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సంద్భంగా పిఆర్‌పిఎఫ్ 42కంపెనీ ఆధ్వర్యాన అల్లూరి సీతరామరాజు జిల్లా, వై.రామవరం మండలం, డొంకరాయి గ్రామంలో శనివారం ఫిట్ ఇండియా ఫ్రీడం రన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 42కంపెనీ ఇన్‌స్పెక్టర్ శశి కుమాం, డొంకరాయి ఎస్సై శివ కుమార్ మాట్లాడుతూ తిండి కలిగితే కండ కలదోయ్ కండ కలవాడేను మనిషోయ్ మహాకవి గురజాడ అప్పారావు చెప్పినట్లు మనం ప్రతి రోజూ మంచి ఆహారం తీసుకోవడంతో పాటు ప్రతి రోజూ వ్యాయామం చేస్తే ఆరోగ్యంగా ఉంటామని, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్‌లా తయారవుతామని చెప్పారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ సుధాకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న సిఆర్‌పిఎఫ్ పోలీసులు



ప్రచారం చేస్తున్న సిపిఎం నేతలు

ప్రజా రక్షణ భేరి బస్సు యాత్రను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: ప్రజారక్షణ భేరి మన్యం బస్సు యాత్రను జయప్రదం చేయాలని శనివారం మండల కేంద్రంలో వారపుసంతలో సిపిఎం నేతలు ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న గిరిజన వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించేందు నవంబర్ 2వ తేదీన సీపీఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శ్రీకాకుళం, మన్యం జిల్లాలో బస్ యాత్ర ప్రారంభం అవుతుందన్నారు. బీజేపీ వైసీపీ ప్రభుత్వాలు ఆదివాసీ గిరిజన ప్రాంతాల్లో ఉన్న అటవీ ప్రాంతాలను బడా కార్పొరేట్లకు కట్ట బెట్టి అటవీ ప్రాంతం నుండి గెంటి వేయాలని ప్రణాళికాలు రచిస్తున్నాయన్నారు.న్యాయ వ్యవస్థ లో ఉన్న క్రిమినల్, అట్రాసిటీ, గిరిజన చట్టాలను సవరించడానికి పార్లమెంట్లో నూతన బిల్లులు కేంద్రం తీసుకొచ్చిందన్నారు. జీఓ 3 రద్దు చేసి ఆదివాసీ నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లేకుండా ప్రభుత్వాలు చేశాయన్నారు. అల్లూరి జిల్లాలో కాఫీ రైతులకు 2017-2022 వరకు ఐటీడీఏ కాఫీ రైతుల బకాయిలు చెల్లించలేదన్నారు. ఈ విషయంపై అనేకమార్లు ఐటీడీఏ ముట్టడి చేసినప్పటికీ కనీస చలనం లేకుండా వ్యవహరించడం దుర్మార్గమని మండిపడ్డారు. గిరిజన ప్రాంతంలో నెలకొన్న అనేక సమస్యలను వెలికి తీసేందుకు ప్రజా రక్షణభేరి బస్సు యాత్ర చేపడుతున్నామని, ఆదివాసి గిరిజన ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ పాటుబోయి సత్యనారాయణ, జర్రెల ఉపసర్పంచ్ వంతల గణపతి, సిపిఎం మండల కమిటీ సభ్యుడు ఎంఎం శ్రీను, గల్లెల నారాయణ, నరసయ్య, డోంబ్రు పాల్గొన్నారు.



పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త, అధికారులు

తెగుళ్ల నివారణ చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలో తడిగిరి గ్రామ పంచాయతీలో వరి పొలాలను ఏరువా కేంద్రం సమన్వయకర్త జే.జగన్నాథం, విస్తరణ శాస్త్రవేత్త వెంకట రావు, వ్యవసాయ వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి యం.విజయ లక్ష్మీ క్షేత్ర సందర్శన శనివారం చేపట్టారు. అనంతరం వ్యవసాయ వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి యం.విజయలక్ష్మీ మాట్లాడుతూ, వ్యవసాయంపై రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించి పంట దిగుబడి, మెలకువలు పై అవగాహన కలిగి ఉండాలన్నారు. సుడిదోమ, దోమపోటు చాలా తీవ్రంగా ఆశించి ఉందని ఆమె పేర్కొన్నారు. రెండు మూడు రోజుల్లోనే పైరు మొత్తం ఎండిపోయే దశ కు చేరిందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ పి.రంజిత్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

11 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలి

సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి కిరణ్

ప్రజాశక్తి-చింతూరు

రైతులు ఎంతో ఆశతో వేసిన వరి, అపరాలు, పత్తి, మిర్చి పంటలు వర్షాల్లేక ఎండిపోతున్నాయని, తక్షణమే ప్రభుత్వం స్పందించి రంపచోడవరం నియోజకవర్గంలోని 11 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి, నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ డిమాండ్ చేశారు. శనివారం చింతూరులో సిపిఎం నాయకులు పల్లపు వెంకట్ అధ్యక్షతన జరిగిన పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో కిరణ్ మాట్లాడుతూ రైతులు అప్పులు చేసి పంటలు వేశారని వర్షాలు లేక పంటలన్నీ ఎండి పోవడంతో వారంతా దిక్కు తోచని స్థితిలో వున్నారని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో నదులున్నప్పటికీ ప్రభుత్వం ఆ నీటిని వ్యవసాయానికి మళ్లించేందుకు తగిన చర్యలు తీసుకోవడం లేదన్నారు. అనేక చోట్ల ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్‌లు పాడైపోగా, ప్రభుత్వాల నిర్లక్ష్యంతో వారికి మరమ్మతులు చేయకపోవడంతో రైతులకు ఉపయోగపడే పరిస్థితి లేకుండా పోయిందని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు 11 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి, నష్టాన్ని అంచనా వేసి పరిహారం చెల్లించాలని, పాడైన లిఫ్ట్ ఇరిగేషన్‌లు, చెరువులకు మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర అధికార బృందాలు ఈ ప్రాంతాలలో పర్యటించి ఎండి పంటను పరిశీలించాలని, సచివాలయాల ద్వారా పంట నష్ట పరిహారాన్ని అంచనా వేసి నమోదు చేయాలని కోరారు. లేని పక్షంలో రైతులను సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మర్లపాటి నాగేశ్వరరావు, లోతా రామారావు, పూనెం సత్యనారాయణ, సీసం సురేష్, మేకల నాగేశ్వరరావు, పాయం సీతారామయ్య, సోయం చినబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కిరణ్, చిత్రంలో జిల్లా నాయకులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -సీలేరు

ఆదివాసీలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ధారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డీకే హిమబిందు అన్నారు. పీహెచ్సీ పరిధిలోని దొరగొంది గ్రామంలో ఆదివాసులు జ్వరాలతో బాధపడుతున్నారని ఆశా కార్యకర్త ఇచ్చిన సమాచారం మేరకు శనివారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దొరగొంది గ్రామానికి దారకొండ నుంచి మూడు కిలోమీటర్లు వాగులు, వంకలు దాటుకుంటూ కాలినడకన వైద్యాధికారి, వైద్య సిబ్బంది చేరుకున్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో 112 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరుగురు జ్వర బాధితులకు రక్త పరీక్షలు చేశారు. గర్భిణులకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గిరిజనులు సీజనల్ వ్యాధులపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. చలితో కూడిన జ్వరం వస్తే వెంటనే ఆసుపత్రికి వచ్చి రక్త పరీక్ష చేయించుకోవాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే వ్యాధి తీవ్రత పెరిగిపోతుందన్నారు. గర్భిణీలు ప్రసవ సమయానికి ముందుగానే ఆసుపత్రిలో చేరాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఈఓ పోతురాజు, పీహెచ్ ఎన్ రాణి, ఎంఎల్‌హెచ్‌పి లోవ కుమారి పాల్గొన్నారు.



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ హిమబిందు

వృద్ధురాలి వైద్యానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కొయ్యూరు

కొన్నాళ్ళుగా తీవ్ర అనారోగ్యంతో బాధపతూ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వృద్ధురాలికి హెల్పింగ్ హేండ్స్ ప్రతినిధులు ఆర్థిక సాయం అందజేశారు. కొయ్యూరు మండలం గోపవరం గ్రామానికి చెందిన మామిడి బంగారమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ నర్సీపట్నంలోని అమ్మ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న హెల్పింగ్ హేండ్స్ ప్రతినిధులు శనివారం బంగారమ్మను కలిసి ఆపరేషన్ నిమిత్తం రెండు వేల రూపాయలు అందించారు. వైద్యులు జివి.రాజుతో సంప్రదించి తక్కువ వ్యయంతో నయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు టి.మల్లేష్, ప్రతినిధులు చిట్టయ్య, హరిదేవ్, పెట్ల గాంధీ, చిన్నబ్బాయి, రాంబాబు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న నేతలు

వైసిపి నేతల ప్రచారం

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: ప్రజా సంక్షేమ పథకాలు అమలు కావాలంటే మళ్లీ సీఎం జగనన్నే ఎందుకు ముఖ్యమంత్రి కావాలి అనే కార్యక్రమాన్ని మండలంలోని కిలగంగి పంచాయతీ వయ్యా గ్రామంలో శనివారం వైసిపి నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో వైసిపి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను గిరిజనులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు చిన్నారావు, ఎస్.భాస్కరరావు, రాజారావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక యువతకు ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: మండలంలోని చాపరాయి జలపాతంలో స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని బిఎస్‌పి నాయకులు డిమాండ్ చేశారు. గూడెం పంచాయతీ కార్యదర్శి ఎం.స్వామి డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గతంలో టెండర్ పాట నిర్వహించే విధానంతో చదువుకుని ఖాళీగా ఉన్న నిరుద్యోగ యువత కొంతమంది కలిసి పెట్టుబడి చేసి నిర్వహణ చేస్తూ ఉపాధి పొందేవారన్నారు. కాగా ఈ ఏడాది నిర్వహణను ఐటిడిఎ తీసుకోవడంతో స్థానిక యువతకు ఉపాధి లేకుండా పోవడంతో ప్రస్తుతం యువత ఖాళీగా ఉన్నారని చెప్పారు. తక్షణ ఉన్నత స్థాయి అధికారులు స్పందించి చాపరాయి జలపాతంలో స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నిరుద్యోగ యువకులు పాల్గొన్నారు.

గంజాయి నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు: గంజాయి కేసులో పరారీలో ఉన్న నిందితుడు గోల్లోరి లోకనాథ్‌ను ముంచంగిపుట్టు పోలీసులు శనివారం పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. స్థానిక ఎస్సై కె.రవీంద్ర తెలిపిన కథనం మేరకు.. మండలంలోని జోలాపుట్ పంచాయతీ లబ్బూరు జంక్షన్ వద్ద పోలీసులు తనిఖీలు చేపడుతున్న క్రమంలో జూలై 4న ఒడిశా నుంచి బొలెరో వాహనంలో 30కిలోల గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేశామన్నారు. ఈ కేసులో మూడు నెలలుగా పరారీలో ఉన్న నిందితుడిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించామని ఎస్సై తెలిపారు.

పాము కాటుతో అస్వస్థత

ప్రజాశక్తి-చింతపల్లి: కూరగాయల తోటలో పాము కాటుకు గురైన సంఘటన మండలంలోని కట్టుపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గూడెం కొత్తవీధి మండలం దామనపల్లి పంచాయతీ పరిధిలోని లోతుగెడ్డ జంక్షన్ గ్రామస్తుడైన వంతల నాగేశ్వరరావు కట్టుపల్లి గ్రామం లోని బంధువు గెమ్మెలి ప్రసాద్ ఇంటికి చుట్టం చూపుగా వెళ్లాడు. ప్రసాద్ కుటుంబ సభ్యులతో కలిసి గ్రామ సమీపంలో శనివారం మధ్యాహ్నం కూరగాయల తోటకు వెళ్లగా పొదల నుంచి వచ్చిన విష సర్పం కాటు వేయడంతో నాగేశ్వరరావు స్పృహ కోల్పోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

విశాఖలో 'కీడ కోలా' చిత్ర బృందం సందడి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : రానా దగ్గుబాటి సమర్పణలో విజి సిన్హా బ్యానర్‌పై వివేక్ సుధన్షు, సాయి కృష్ణ గద్వాల్, ఉపేంద్ర వర్మ నిర్మాతలు డైరెక్టర్ తరుణ్ భాస్కర్ దాస్యం మూడో చిత్రంగా కీడ కోలా చిత్రం నవంబర్ 3న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. చిత్ర ప్రచార కార్యక్రమాల్లో భాగంగా శనివారం ఎంవిపి కాలనీ గాది రాజు పాలెస్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హీరో చైతన్యరావు మదాడి మాట్లాడుతూ ఇటీవల విడుదలైన ట్రయలర్, పాటలకు మంచి స్పందన వస్తుందన్నారు. డైరెక్టర్ తరుణ్ భాస్కర్ నుంచి మరో మంచి సినిమా వస్తుందని చెప్పారు. డార్క్ క్రైమ్ కామెడీ కథతో అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే విధంగా ఉంటుందని, ఇప్పటి సినిమాలకు భిన్నంగా ఉండే ఈ సినిమా అమెరికాలో 400 స్క్రీన్ లలో విడుదల అవుతుందని తెలిపారు. ఈ మీడియా సమావేశంలో నటులు రాగ మయూర్, విష్ణు పాల్గొన్నారు.

రంగురాళ్ల క్వారీలపై ప్రత్యేక నిఘా



చింతపల్లి డివిజనల్ అటవీ శాఖాధికారి సూర్యనారాయణ పడాల్

ప్రజాశక్తి -చింతపల్లి: గూడెం కొత్తవీధి మండలం దామనపల్లి పంచాయతీ పరిధిలోని సిగినాపల్లి సమీప కొండలో అక్రమంగా రంగురాళ్ల తవ్వకాలు నిర్వహిస్తున్నట్లు వివిధ దినపత్రికల్లో వస్తున్న కథనాలపై క్వారీలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చింతపల్లి డివిజనల్ అటవీశాఖ అధికారి చిట్టపల్లి సూర్యనారాయణ పడాల్ తెలిపారు. శనివారం చింతపల్లి అటవీ శాఖ క్యాంప్ కార్యాలయంలో పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ, రంగురాళ్ల క్వారీలపై నిఘాను కట్టుదిట్టం చేసి తవ్వకాలను నిరోధించేందుకు ఆయా శాఖల అధికారులతో కలిసి కృషి చేస్తున్నట్లు తెలిపారు. జీకే వీధి సిఐ అశోక్ కుమార్, జీకే వీధి తహశీల్దార్ ప్రసాద్ రావులతో చర్చించి, రంగురాళ్ల తవ్వకాలను అరికట్టేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రంగురాళ్ల క్వారీ ప్రాంతంలో బేస్ క్యాంపులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మాయమాటలతో సిగినాపల్లి అటవీ ప్రాంతంలో రంగు రాళ్ల తవ్వకాలకు అమాయక గిరిజనులను ప్రోత్సహిస్తున్నారని, అటువంటి వ్యాపారస్తులపై పోలీస్, రెవెన్యూ శాఖల సమన్వయంతో కేసులు నమోదు చేయడమే కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు వెనకాడబోమన్నారు. రంగురాళ్ల తవ్వకాలకు పాల్పడిన లేదా ప్రోత్సహించిన పట్టుబడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, అటవీ చట్టాలతో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఏజెన్సీ ప్రాంతంలో నిక్షిప్తమై ఉన్న అటవీ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత ఆయా ప్రాంతాలలో ఉన్న గిరిజనుల దేనని, అత్యాశకు పోయి రంగురాళ్ల తవ్వకాలకు పాల్పడవద్దని హితవు పలికారు. అదేవిధంగా రంగురాళ్ల క్వారీలో ఉన్న పరిసర ప్రాంత ప్రజలు ఎవరైనా వ్యాపారస్తులు రంగురాళ్ల తవ్వకాలకు ప్రోత్సహించినా, కొనుగోలు చేస్తున్న తమకు సమాచారం అందించాలని కోరారు. తమకు సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.

వాహన తనిఖీలపై స్పెషల్ డ్రైవ్


ప్రమాదాల నియంత్రణపై ఎస్‌పి దృష్టి

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్‌పి) తుహిన్ సిన్హా రోడ్డు ప్రమాదాల నియంత్రణపై దృష్టి సారించారు. ఈ మేరకు వాహన తనిఖీలపై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. అల్లూరి సీతారామరాజు జిల్లా లో ఎక్కువగా ఘాట్ రోడ్లు, మలుపులు, మంచు తీవ్రతతో ప్రమాదాలు జరుగుతున్నాయని భావించి వాహన తనిఖీలను ముమ్మరం చేశారు. ముఖ్యంగా ఓవర్ లోడింగ్‌తో ప్రమాదాలతో మరణిస్తున్న దృష్ట్యా పోలీస్ వెహికల్ చెకింగ్ స్పెషల్ డ్రైవ్ గత రెండు రోజులు నిర్వహించి ఓవర్ లోడ్ చేసిన వాహనాలపై 18 కేసులలో నమోదు చేసి వాహనాలను సీజ్ చేశారు. ఇదే విధంగా వాహనాలను ఓవర్ లోడ్ చేసిన వారిపై చర్యలు తీసుకోవడం, కేసులు కట్టడం కొనసాగుతుందని ఎస్పీ ఒక ప్రకటనలో విలేకరులకు తెలిపారు. ఇకపై వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ ను పాటిస్తూ పరిమితమైన స్పీడ్, లోడింగ్ విషయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమైన ప్రదేశాల్లో స్టాపర్లు, స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని పోలీస్ యంత్రాంగానికి సూచించారు.

మోదకొండమ్మకు బంగారు ఆభరణం వితరణ

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు మోదకొండమ్మ అమ్మవారికి అరకు మాజీ పార్లమెంట్ సభ్యురాలు కొత్తపల్లి గీత దంపతులు రూ.26 లక్షల విలువైన బంగారు ఆభరణాన్ని సమర్పించారు. శనివారం గీత దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి ఈ ఆభరణాన్ని అమ్మవారికి సమర్పించేందుకు ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భక్తి, విశ్వాసం కలిగి ఉండాలన్నారు.

ఈ సందర్భంగా ఆలయ కమిటి చైర్మన్ పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, నరసింగరావు, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలం నాయుడు తదితరులు మాజీ ఎంపీ కొత్తపల్లి గీత దంపతులను సత్కరించి అమ్మవారి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


బంగారు ఆభరణాన్ని ఇస్తున్న మాజీ ఎంపీ గీత దంపతులు

అసెంబ్లీలో తీర్మానం తగదు

ప్రజాశక్తి-జి.మాడుగుల: బోయ/వాల్మీకిల్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో రెండోసారి తీర్మానం చేయడం తగదని దండకారణ్య ఉద్యోగ సమితి రాష్ట్ర అధ్యక్షులు మాణిక్యం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఈ స్థానిక విలేకరులతో శనివారం మాట్లాడుతూ, బోయ/వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని రెండోసారి శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తుంటే స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. గిరిజనులకు ఎంతో ఉపయోగకరమైన జీవో 3 రద్దు చేస్తే దీనిపై శాసనసభలో ఎందుకు నోరు మెదపలేదన్నారు. ఇప్పటికైనా గిరిజన మేధావులు మేలుకుని, ఉద్యమ బాట పట్టాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎల్ఓ రంజిత్ కుమార్, దండకరణ్య సభ్యులు పాల్గొన్నారు


పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్

శతాబ్ది పైలాన్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ

ఆంధ్ర వైద్య కళాశాలలో శతాబ్ది ఉత్సవాల పైలాన్‌ను భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ శనివారం ఆవిష్కరించారు. శుక్రవారం ప్రారంభమైన ఆంధ్ర మెడికల్ కాలేజీ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొనేందుకు శనివారం ఉపరాష్ట్రపతి విశాఖ వచ్చారు. ఐఎన్‌ఎస్ డేగాలో ఉపరాష్ట్రపతికి రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి విడదల రజని పుష్పగుచ్ఛాలను అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఉపరాష్ట్రపతి ఆంధ్రా మెడికల్ కాలేజీ శతాబ్ది ఉత్సవాలకు హాజరయ్యారు. శతాబ్ది ఉత్సవాలకు గుర్తుగా వైద్య కళాశాల ఆవరణలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ మొక్కలు నాటారు. అనంతరం ఆంధ్ర వైద్య కళాశాల పానగల్ బిల్డింగులో వైద్య కళాశాల చరిత్ర, సాధించిన విజయాలకు సంబంధించి ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఆంధ్ర వైద్య కళాశాలలో చదువుకొని దేశ, విదేశాలలో పేరు ప్రఖ్యాతలు గడించిన పూర్వ విద్యార్థులు, సీనియర్ వైద్యులు 38 మందితో భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ కలిసి గ్రూపు ఫోటో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఎంపీ ఎంవివి సత్యనారాయణ, అనకాపల్లి ఎంపీ డాక్టర్ బివి.సత్యవతి, రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావు, సిఎం రమేష్, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, డాక్టర్ పి.అశోక్‌కుమార్, డాక్టర్ బుచ్చిరాజు, జివిఎంసి కమిషనర్ సాయి కాంత్‌వర్మ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జి.సుభద్ర, నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్, డాక్టర్ శశి ప్రభ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సహకారం ఉన్న ఏకైక కళాశాల : గవర్నర్

హార్వర్డ్ మెడికల్ స్కూల్, నార్త్ కరోలినా యూనివర్శిటీ వంటి ప్రపంచ ప్రఖ్యాత వైద్య సంస్థలతో అంతర్జాతీయ సహకారాన్ని కలిగి ఉన్న రాష్ట్రంలోని ఏకైక వైద్య కళాశాలగా ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రత్యేకతను కలిగి ఉందని రాష్ట్ర గవర్నర్ అబ్దుర్ నజీర్ పేర్కొన్నారు. విశాఖపట్నం బీచ్‌రోడ్‌లోని ఏయు కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన ఆంధ్రా మెడికల్ కళాశాల శతాబ్ది ఉత్సవాల్లో ఆయన మాట్లాడారు. వైద్యులతో పాటు, నర్సింగ్, అనుబంధ ఆరోగ్య సేవలు, ఆసుపత్రి నిర్వహణ వంటి ఇతర భాగాలు కూడా ఆరోగ్య సంరక్షణ రంగం యొక్క పెరుగుతున్న అవసరాలను తీర్చడానికి సమాన వేగంతో వృద్ధి చెందాలన్నారు. ఇక్కడ చదివి ప్రపంచవ్యాప్తంగా ఉన్న 10,000 మందికిపైగా ఉన్న పూర్వ విద్యార్థులు వైద్య వృత్తికే కాకుండా పరిశోధన, పరిపాలన, వ్యవస్థాపకత, వివిధ కళారూపాలు, రక్షణ, విధాన రూపకల్పనలో గణనీయమైన కృషి చేయడం కళాశాలకు గర్వకారణం అన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యం : మంత్రి రజని

'ఆరోగ్య ఆంధ్రప్రదేశ్' లక్ష్య సాధనలో తమ ప్రభుత్వం ఒక స్పష్టమైన వ్యూహాన్ని రూపొందించిందని, ప్రపంచ స్థాయి ఆరోగ్య సంరక్షణ సేవలను మెరుగుపరచడం ద్వారా ఆరోగ్య సంరక్షణలో అగ్రగామిగా నిలపడం కోసం కృషి చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య మంత్రి విడదల రజని చెప్పారు. ఆరోగ్య సంరక్షణ రంగంలో మనం సాధించిన అద్భుతమైన పురోగతిని ప్రతిబింబించే విధంగా ఈ వేడుకలు నిర్వహించడం సంతోషకరం అన్నారు.

కాగడాలతో టిడిపి నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న టిడిపి నేతలు, కార్యకర్తలు

ప్రజాశక్తి -కొయ్యూరు :టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అరెస్ట్‌కు నిరసనగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎంవివి.ప్రసాద్ ఆధ్వర్యాన కొయ్యూరు మండలం, బంగారంపేట గ్రామంలో శనివారం కాగాడాల ప్రదర్శన చేశారు. అనంతరం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి చేపట్టిన నిజం గెలవాలి కార్యక్రమం విజయవంతం కావాలని ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అనిశెట్టి చిరంజీవి, పాంగి రాజుబాబు, జగిలే బాలరాజు, మేడిబోయిన చిన్న, కాకూరి చంద్రరావు, గోమం రామకృష్ణ, బాచి, మువ్వల రాజు, కయ్యం రాజు, జనసేన కార్యకర్త నాని పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు


వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి -సీలేరు: గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు జీకే వీధి మండలం సీలేరు పరిసర ప్రాంతాల్లో శనివారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల నుంచి గంజాయి అక్రమంగా రవాణా జరుగుతుండడంతో ఆ దిశగా స్థానిక ఎస్సై జె.రామకృష్ణ ఆధ్వర్యాన నిఘా పెట్టారు. ఐటిఐ జంక్షన్, స్థానిక ఏపి జెన్కో చెక్ పోస్ట్, ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ప్రాంతాల్లో పోలీసులు అణువణువునా తనిఖీలు చేశారు. ఆంధ్ర నుంచి వచ్చే పోయే వాహనాలు నిలుపుదల చేసి క్షుణ్ణంగా పరిశీలించి విడిచిపెట్టారు. అపరిచిత వ్యక్తులు ఎవరైనా గ్రామాల్లో సంచరిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఎస్‌పి కోరారు.

పోలీసు స్టేషన్‌లో రక్తదాన శిబిరం


రక్తదాన శిబిరంలో పాల్గొన్న సిఐ, ఎస్ఐ, ఇతర పోలీసులు

ప్రజాశక్తి-రంపచోడవరం పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా రంపచోడవరం పోలీసు స్టేషన్‌లో ఏఎస్పీ ఆదేశాల మేరకు శనివారం ఏరియా హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పలువురు పోలీస్ సిబ్బంది రక్తదానం చేశారు. ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్, వైద్యులు, సిబ్బంది, రంపచోడవరం సీఐ సురేష్ బాబు, ఎస్ఐ మోహన్ కుమార్, దేవీపట్నం ఎస్సై నాగార్జున, అడిషనల్ ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి


నివాళులర్పిస్తున్న ఐటిడిఎ ఎపిఒ, తదితరులు

ప్రజాశక్తి-రంపచోడవరం :వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకొని శనివారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి ఐటిడిఎ ఏపీఓ జనరల్ సిహెచ్.శ్రీనివాసరావు. గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాన్ రాజ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎపిఒ శ్రీనివాసరావు మాట్లాడుతూ వాల్మీకి రామాయణాన్ని పూర్తిగా తెలుసుకొని రానున్న తరాల వారికి అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఎపిడి రాంబాబు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాను, ఎంపిహెచ్ఒ పీటర్, సీనియర్ అసిస్టెంట్లు శ్రీనివాసరావు, చక్రధర్, డి ప్రభాకర్, శ్రీనివాసరెడ్డి, బి.రాజు, పల్లాల లక్ష్మిరెడ్డి, రాజారెడ్డి, నాగభూషణం, సిహెచ్. సోమిరెడ్డి, కె.సోమిరెడ్డి పాల్గొన్నారు.

కొయ్యూరు : మండలంలోని వెలగలపాలెంలో గొడ్డేటి దేముడు స్మారక పార్క్ వద్ద వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అక్కడున్న వాల్మీకి విగ్రహానికి అల్లూరి జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు గొడ్డేటి మహేష్ బాబు, నేను సైతం చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శివప్రసాద్ పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో వెలగలపాలెం సర్పంచ్ సత్యనారాయణ, శరబన్నపాలెం సర్పంచ్, ఎంపిటిసి కిమిడి సత్తిబాబు, లోకుల సోమా గాంధీ, కిరణ్ మాస్టర్, ఉపాధ్యాయులు, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకికి నివాళులర్పిస్తున్న మహేష్, శివప్రసాద్, తదితరులు

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం


పరిశుభ్రతా పనుల్లో సిఆర్‌పిఎఫ్, లోకల్ పోలీసులు

ప్రజాశక్తి -సీలేరు : పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని సిఆర్‌పిఎఫ్ జి42 బెటాలియన్ డిఎస్పి సురేష్ అన్నారు. జీకే వీధి మండలం సీలేరులోని మారమ్మ దేవాలయం ప్రాంగణం చుట్టుపక్కల, స్థానిక ఏపీ జెన్కో మెయిన్ డ్యామ్ పరిసరాల్లో శనివారం చెత్తాచెదారాలు, వ్యర్థాలను తొలగించి శుభ్రపరిచారు. ఈ సందర్భంగా డీఎస్పీ సురేష్ మాట్లాడుతూ సీలేరు పరిసర ప్రాంతాల్లో సహజసిద్ధమైన ప్రకృతి రమణీయమైన దృశ్యాలు ప్రతిరోజూ ఆవిష్కృతమవుతాయని, పర్యాటకులు ఈ ప్రాంతాలను సందర్శించి ఎంతో అనుభూతిని పొందుతారని తెలిపారు. అందుకే స్థానిక మెయిన్ డ్యాం ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు సమీపంలో ఉన్న రహదారికి ఇరువైపులా పరిసర ప్రాంతాల్లో తుప్పలు చెత్తాచెదారాలు తొలగించి నిప్పు పెట్టామని తెలిపారు. కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ ఇన్‌స్పెక్టర్ సుందరం, పోలీసులు పాల్గొన్నారు

గిరిజన రైతులకు చేప పిల్లల పంపిణీ


చేప పిల్లలు పంపిణీ చేస్తున్న ఐటిడిఎ ఎపిఒ, తదితరులు

ప్రజాశక్తి-రంపచోడవరం : ఐటీడీఏ నిధులతో ఏజెన్సీ మండలాల్లో చేపల సాగు చేసుకునే గిరిజన రైతులకు ఎన్ఆర్ఇజిఎస్ ఫారం ఫండ్స్‌ల ద్వారా ఒక్కొక్క రైతుకి 500 చేప పిల్లలు (కట్ల 300 మిర్యాల 100 రూప్ చంద్ 50 గడ్డిచాక 50) చొప్పున మొత్తం సుమారు 1,17,500 చేప పిల్లలను అందజేశారు. ఈ మేరకు ఐటిడిఎ ఏపీవో జనరల్ చేతుల మీదుగా రైతులకు మత్స్య శాఖ వారి ద్వారా పందిరి మామిడి మత్స్య క్షేత్రంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్డిఓ సిహెచ్ రమేష్, మత్స్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని వెలగలపాలెం, అంతాడ గ్రామ పంచాయితీల యువతకు వాలీబాల్ కిట్లును అరకు ఎంపీ గొడ్డేటి మాధవి సోదరుడు, ఎఎస్ఆర్ జిల్లా గ్రీవెన్స్ అధ్యక్షుడు గొడ్డేటి మహేష్ చేతుల మీదుగా శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ గిరిజన యువత అని రంగాల్లో రాణించాలన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసకాకుండా, క్రీడల్లో యువను ప్రోత్సహించడానికి అరకు పార్లమెంట్ సభ్యురాలు గొడ్డేటి మాధవి వీటిని అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సుర్ల చంద్రరావు, ఇడవాడ సతీష్, గ్రామ యువత పాల్గొన్నారు.


వాలీబాల్ కిట్లు పంపిణీ చేస్తున్న మహేష్, తదితరులు

టిడిపి హయాంలోనే అభివృద్ధి


రచ్చబండలో మాట్లాడుతున్న రంజిత్‌కుమార్

ప్రజాశక్తి- కూనవరం : విలీన మండలాలు టిడిపి ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి చెందాయని తెలుగు యువత అరకు పార్లమెంట్ నియోజకవర్గం అధికార ప్రతినిధి గడేసుల రంజిత్ కుమార్ అన్నారు. బాబు కోసం రచ్చబండ కార్యక్రమం మండలంలోని చూచిరేవులగుడెం గ్రామంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మీద పెట్టిన అక్రమ కేసులు, చంద్రబాబు ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి గురించి తెలియజేశారు. రాబోయే రోజుల్లో టీడీపీ అధికారంలోకి వస్తుందని, అప్పుడు జిఓ నెంబర్ 52ను రద్దు చేస్తారని చెప్పారు. 2014లో ఆంధ్రాలో కలిపిన కూనవరం, చింతూరు, విఆర్ పురం, ఎటపాక మండలాల ప్రజలు రంపచోడవరం వెళ్ళడానికి ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఎటపాక రెవెన్యూ డివిజన్ ఇవ్వటమే కాకుండా మినీ ఐటిడిఎ, ఆర్‌టిఒ కార్యాలయం, ఆర్టీసి బస్టాండ్, సబ్ ట్రెజరీ ఆఫీస్, గిరిజన కార్పొరేషన్ ద్వారా పెట్రోల్ బంక్, పవర్ గ్రిడ్ ఈ ప్రాంతంలో ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. రూ.10 కోట్లతో కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ఏరియా హాస్పిటల్, డయాలసిస్ సెంటర్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. టిడిపి అధికారంలోకి వస్తే కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా మండలం మొత్తాన్ని ఒక యూనిట్‌గా పరిగణించి పోలవరం ప్యాకేజీ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాని పండు పండు, మేడి రాము, మేడి ప్రవీణ్, వినోద్, నరేంద్ర, హరీష్, రామారావు, శ్రీను, సురేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

ప్రజాశక్తి -కొయ్యూరు :మండలంలోని మర్రివాడ సచివాలయం పరిధిలో శనివారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఎంపీపీ బడుగు రమేష్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల వద్దకు పాలన తీసుకొచ్చిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో, వైసిపి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి రమేష్

ప్రి రిపబ్లిక్‌డే పరేడ్ శిక్షణకు ఎయు విద్యార్థులు

ప్రజాశక్తి- విశాఖపట్నం : ప్రి రిపబ్లిక్‌డే పరేడ్‌కు ఐదుగురు ఆంధ్రవిశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఎంపికయ్యారు. శనివారం వీరిని తన చాంబర్‌లో విసి ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి అభినందించారు. ఎయు అనుబంధ కళాశాలకు చెందిన అశ్రీన మీర్జా మహమ్మద్, కె.రచన, కె.కేధశ్రీ, పి.హేమలత, ఎస్.కల్యాణి వచ్చేనెల ఒకటి నుంచి పదో తేదీవరకు విజయవాడ కె.ఎల్ యూనివర్సిటీలో జరిగే ప్రత్యేక శిక్షణ శిబిరంలో పాల్గొంటారు.

జాతీయస్థాయిలో ప్రతిష్టాత్మకంగా జరిగే రిపబ్లిక్‌డే పరేడ్‌కు ఎయు విద్యార్థులు ఎంపికపై విసి హర్షం వ్యక్తం చేసి, విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలోకె.ఎల్ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య పార్థసారధివర్మ, ఎయు ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్ పాల్గొన్నారు.